# మహానగరంలో మహాదేవుడు

మూడేళ్ళక్రితం ఉద్యోగరీత్యా అమెరికా వెళ్ళి అక్కడే సెటిలైన మహాదేవుడు ఓ సెమినార్‌లో పాల్గొనేటందుకు, ఆఫీసువాళ్లు పంపిస్తే మళ్ళీ హైదరాబాద్ వచ్చాడు. మూడు రోజుల పాటు జరిగే ఆ సెమినార్‌కి హాజరై నాలుగోనాడు సాయంత్రం బొంబాయి మీదుగా అతను తిరిగి అమెరికా వెళ్ళిపోవాలి.

భాగ్యనగరంలో వుండే మూడురోజులూ ఎలాగడపాలో ముందుగానే ప్లాన్ చేసుకుని మరీ వచ్చాడు మహాదేవుడు. అక్కడ అతనికి ఆప్తమిత్రులనబడే వాళ్లు ఓ నలుగురైదుగురు వున్నారు కనుక వాళ్ళను కలుసుకునేందుకు మొదటి రెండు రోజులూ కేటాయించుకున్నాడు. మూడవరోజున 'షాపింగ్ ' చేయాలని తీర్మానించుకున్నాడు. హైదరాబాద్‌లో విమానం దిగ్గానే ఓ స్టార్ హోటల్ కి చేరుకుని రూమ్ తీసుకున్నాడు.

ఆనాటి సెమినార్ ముగిసిం తర్వాత తన ఆప్తమిత్రుడు అప్పారావుని కలుసు కునేందుకు మలక్‌పేట వెళ్ళాడు మహాదేవుడు. ఆ సమయానికి అప్పారావు బాల్కనీలో కూర్చుని, బట్టతల వెనకాల ' అంచు' గా మిగిలిపోయిన పాతిక ముప్పయి వెంట్రుకల్లో వేళ్లు దూర్చి సవరించుకుంటూ ఆకాశంలోకి చూస్తున్నాడు.

"హాల్లో అప్పూ!" అంటూ అతన్ని ఉత్సాహంగా పలకరించాడు మహాదేవుడు.

పిలుపు విన్న అప్పారావు ఒక్క ఉదుటున తనకు ఎదురొచ్చి ఆత్మీయంగా తనను గుండెలకు హత్తుకుంటాడని ఆశగా ఎదురు చూస్తూ గుమ్మంలోనే నిలబడి వున్న మహాదేవుడికి ఆశాభంగమైంది.

"నువ్వట్రా మాదేవుడూ? అమెరికానించేనా రావడం?"- కూర్చున్న కుర్చీలోంచి కూడా లేవలేకపోగా 'అంబాజీపేటనించేనా రావడం?' అని అడిగినంత అతి మామూలు ధోరణిలో అడిగాడు అప్పారావు.

అదేక్షణంలో లోపలిగదిలోంచి బయట కొచ్చిన అప్పారావు భార్య అలివేలు మహాదేవుణ్ణి చూసి మహదానందంతో పలకరించింది. "బావున్నారా అన్నయ్యగారూ? అమెరికానించి ఎప్పుడొచ్చారు? వదినగార్నీ పిల్లల్నీ కూడా తీసుకొచ్చారా? ఎక్కడ దిగారూ?"

ఆవిడ సంధించిన ప్రశ్నలన్నింటికీ వరుసగా సమాధానాలు చెప్పి అప్పారావ్‌కి ఎదురుగా వున్న కుర్చీలో చతికిలబడ్డాడు మహాదేవుడు.

అతనితో పది నిమిషాలు పిచ్చాపాటీ మాట్లాడేలోగా, అలివేలు టీ తయారుచేసి తెచ్చింది. అది తాగింతర్వాత, తాను అమెరికానించి గిఫ్టుగా తెచ్చిన రిస్టువాచీని ఆమెకు అందించాడు. దాన్నిచూసి అలివేలు ఎంతో ముచ్చటపడిపోయింది.

అప్పటికీ అప్పారావులో స్పందన కనిపించలేదు.

"ఒరే అప్పూ! నీ కోసం నీ ప్రియురాల్ని తీసుకొచ్చాన్రా" అంటూ హ్యాండ్‌బ్యాగ్ లోంచి స్కాచ్ బాటిల్ తీసి టీపాయ్ మీద పెట్టాడు మహాదేవుడు.

'అలివేలు తనను కట్టుకున్న ఇల్లాలైతే' - 'మందుసీసా తనను ఆకట్టుకునే ప్రియురాల'ని అప్పారావు చాలాసార్లు అంటూండేవాడు.

ఏ రోజూ ముచ్చటగా మూడు 'పెగ్గు'లైనా తాగందే అతను నిద్రపోడన్న సంగతి అతని 'మందు మిత్రులం'దరికీ తెలుసు. 'ఫారెన్ సరుక'ంటే అతనికి మరింత మక్కువన్న విషయం మహాదేవుడికి తెలుసు. అందుకే అమెరికానించి ఓ అందమైన స్కాచ్‌బాటిల్ అతనికి బహుమతిగా తీసుకొచ్చాడు.

టీపాయ్‌మీద అందాలొలికిస్తూ, నోరూరిస్తూ, కనువిందు చేస్తూన్న అమృతభాండం లాంటి ఆ బాటిల్ని చూడగానే అప్పారావు- ముందు ఉలిక్కిపడి, తర్వాత దాన్ని రెండు చేతుల్లోకీ తీసుకున్నాడు. ఆప్యాయంగా గుండెలకు హత్తుకుని ప్రేమగా ముద్దులు పెట్టుకున్నాడు. ఆ తర్వాత కొన్ని క్షణాలపాటు అలాగే దానివైపు కన్నార్పకుండా చూస్తూండిపోయాడు. ఆ కళ్ళల్లోకి కన్నీళ్లు ఉబికి రావడం గమనించిన మహాదేవుడు అతనివైపు దిగ్భ్రాంతిగా చూస్తూ అడిగాడు -

"ఏమిట్రా అప్పూ ! ఎందుకా కన్నీళ్ళు? ఏం జరిగింది?"

అంతవరకూ అప్పారావ్ గొంతులో ఘనీభవించిన దుఃఖం ఆ పరామర్శతో కరిగి కట్టలు తెంచుకుంది.

"ఛీ...వెధవ బ్రతుకు " అని గొణుక్కుంటూనే చేతిలో వున్న బాటిల్‌ని నేలకేసి కొట్టాడు.

ఆ వెంటనే ఏడుస్తూ 'బెడ్‌రూం'లోకి వెళ్ళి దుప్పటి ముసుగుతన్ని పడుకున్నాడు.

అప్పారావ్ ధోరణి కొంచెమైనా అర్థంకాక మహాదేవుడికి మతిపోయినంత పనైంది.

బిత్తరపోయి అలివేలువైపు చూశాడు.

"మీరేం అనుకోకండి అన్నయ్యగారూ! ఈ మధ్య 'కలర్‌బాటిలు' ఏది కనిపించినా ఇలాగే నేలకేసి కొట్టి ఏడుస్తూ మంచం ఎక్కి పడుకుంటున్నారు" చెప్పిందామె, అదేదో సర్వసాధారణమైన సంగతిలా.

"ఇదెక్కడి జబ్బమ్మా" అంటూ విపరీతంగా ఆశ్చర్యపోయాడు మహాదేవుడు.

"ఏం చెప్పమంటారన్నయ్యగారూ! ఇక్కడి గవర్నమెంటు మద్యనిషేధం పెట్టిందిగా? ఎవ్వరూ తాగడానికి వీల్లేదు" అని చెప్పింది అలివేలు.

"పోనీ రహస్యంగా ఇంట్లోనే కూర్చుని తాగెయ్యచ్చుగా... ఈ మాత్రం దానికి బంగారంలాంటి బాటిల్ని బద్దలుకొట్టడం ఎందుకూ పిచ్చికాకపోతే"

"ఇంట్లో రహస్యంగా తాగుతున్న సంగతి బయట పడినా ప్రమాదమేనట అన్నయ్యగారూ! " ఇన్‌కంటాక్సు వాళ్ళలాగా, పోలీసులుకూడా - అర్ధరాత్రీ అపరాత్రీ అని చూడకుండా ఎప్పుడైనా సరే, అవసరమైతే బెడ్ రూమ్స్‌లోకి కూడా చొరబడి సోదా చేయచ్చట! పైగా ఈయన గారు ప్రతిరోజూ తాగందే నిద్రపోరన్న సంగతి చుట్టుపక్కల వాళ్ళందరికీ తెలుసు నాయె!..... గిట్టని వాళ్ళెవరైనా వాసనొస్తే పోలీసులకు ఫోన్ చేసి చెప్తారేమోనని భయం ! అందుకే ఈన తాగటం మానేశారు. కానీ - ఏదైనా రంగుసీసా కనిపిస్తే చాలు - ఆ బాధ తట్టుకోలేక దాన్ని - ఇలా నేలకేసి కొట్టి - గుడ్లనీళ్ళు కుక్కుకుంటూ - దుప్పటి ముసుగెట్టుకొని ఏడుస్తూ పడుకుంటారు.... మళ్ళీ ఆయన మనలోకంలోకి రావాలంటే రెండు మూడు గంటలైనా పడుతుంది !" - అప్పారావ్ సైకాలజీని వివరించి చెప్పింది అలివేలు.

అప్పారావ్ పరిస్థితిని అర్ధంచేసుకున్న మహాదేవుడు, మంచం మీద పడుకుని - దుప్పట్లో వెక్కిళ్ళు పెడుతున్న అతని వైపు జాలిగా చూశాడు.

"డాక్టర్ సర్టిఫికెట్ ఇస్తే - తాగటానికి పర్మిట్ ఇస్తారట" - అంతలోనే మళ్ళీ చెప్పింది అలివేలు.

"మరింకనేం ? అలా ఓ పర్మిట్ సంపాదించలేక పోయాడా?"- అడిగాడతను.

" ఆ ప్రయత్నమూ అయిందన్నయ్యగారూ!..... 'తాగితే ఎన్నో రోగాలు వస్తాయే తప్ప ఏ ఒక్కరోగమూ తగ్గదనీ - పైగా తాగుడనే దురలవాటును తప్పించుకోవటానికే ప్రభుత్వం మద్యనిషేధ చట్టాన్ని అమలు చేస్తోందనీ' - చెప్పి అలాంటప్పుడు మేం సర్టిఫికెట్ ఎలా

ఇవ్వగలం?' - అన్నారట కొందరు డాక్టర్లు - మరికొందరు డాక్టర్లు - సర్టిఫికెట్‌కి అయిదు వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నారట...."

"పోతే పోయింది ! అయిదువేలూ పారేసి ఓ సర్టిఫికెట్ తీసేసుకోవాల్సింది" - మధ్యలోనే అన్నాడు మహాదేవుడు.

"నిజమేననుకోండి ! కానీ, అక్కడితో అయిపోతుందా ? మళ్ళీ మరో అయిదువేలు ఛలానా కడితేనేగానీ ప్రభుత్వంవాళ్ళు పర్మిట్ ఇవ్వరట... అలా ఏటా, వేలకువేలుపోసి రోజుకో రెండుమూడు పెగ్గులు తాగినా - ఆఖర్చు సంగతి గుర్తుకొచ్చి మందు కిక్కివ్వదట!" - చెప్పింది అలివేలు.

"అయితే ఇంక వీణ్ణి ఆ భగవంతుడే కాపాడాలి"!- అనుకుంటూ, అనవసరంగా సీసా తెచ్చి, మిత్రుణ్ణి ఏడిపించినందుకు నొచ్చుకుని - అలివేలుకి 'సారీ' చెప్పి ఆమె దగ్గర వీడ్కోలు తీసుకున్నాడు మహాదేవుడు.

ఆ సాయంత్రానికి అప్పారావ్‌తో కబుర్లు చెప్పుకుంటూ, అతనితో రెండు పెగ్గులు తాగి వాళ్ళింట్లోనే డిన్నర్ కూడా చేసి రూమ్‌కి తిరిగి వెడదామనుకున్న మహాదేవుడుకి ఆ విధంగా ఆశాభంగం కావటంతో ఏం చేయాలో తోచక, ఎటు పోవాలో తెలియక - కొన్ని క్షణాలు అలాగే రోడ్డు మీదకొచ్చి నిలబడ్డాడు.

అంతలోనే అతని దృష్టి - రోడ్డు మధ్యగా నడుచుకుంటూ, తనలోతానే ఏదో మాట్లాడుకుంటూ వేగంగా వెళ్ళిపోతున్న వ్యక్తిపైన పడింది.....! చేతిలో చిన్న బ్రీఫ్ కేసు....కళ్లకు సోడాగ్లాసు కళ్ళద్దాలు....! ఒకప్పుడు తను పనిచేసిన కంపెనీలోనే అతనూ ఇంజనీరుగా పనిచేసేవాడు..... పేరు వామనమూర్తి !,........ మలకపేటలోనే వుంటున్నానని చెప్పేవాడు. అయితే, అతనింటికి మహాదేవుడు ఎప్పుడూ వెళ్ళలేదు.... కానీ, ఇద్దరూ కంపెనీ బస్సులోనే కొంత దూరం ప్రయాణం చేసేవారు.

వామనమూర్తి పగలుకూడా తాగి ఆఫీసుకి వచ్చేవాడు. ఓ సారి మేనేజర్ అతన్ని పిలిచి ముఖం వాచేలా చీవాట్లు పెట్టాడు......తాగి ఆఫీసుకొస్తే ఉద్యోగంలోంచి తీసేస్తానంటూ హెచ్చరించాడు.... అప్పటినించీ వామనమూర్తి కొంత జాగ్రత్తగా వ్యవహరించేవాడు.

'ఇప్పుడు వామనమూర్తి అదే కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడా?...తాగుడు కూడా అదే రీతిలో తాగుతున్నాడా? ప్రొహిబిషన్ పెట్టారు కనుక ఒక వేళ తాగటం మానేశాడా?' మొదలైన విషయాలన్నీ తెలుసుకోవాలనిపించింది మహాదేవుడికి.

"హలో " ! అంటూ ఓ అడుగుముందుకువేసి అతన్ని పలకరించాడు.

తనను కాదన్నట్టుగా అతను ముందుకు సాగిపోతూనే వున్నాడు.

" హలో వామనమూర్తీ ! నిన్నే !" - మరింత గట్టిగా పిలుస్తూ అతన్ని వెంబడించాడు మహాదేవుడు.

అయినా ప్రయోజనం కనిపించలేదు........ అతనలా ' యంత్రం' లా నడిచిపోతూనే వున్నాడు.

"నిన్నేనయ్యా వామనమూర్తీ ! వినిపించుకోవేం?"- పరుగులాంటి నడకతో వెళ్ళి అతని భుజం మీద చేయివేసి మరీ పలకరించాడు మహాదేవుడు.

అతను ఆగిపోయి - కుడిచేతి మధ్యవేలితో కళ్ళజోడును పైకె తీసుకుని మహాదేవుడు వైపు వింతగా చూశాడు.

"నేనేనయ్యా! మహాదేవరావుని! మూడేళ్ళక్రితం ఎస్సార్‌కంపెనీ లో ఇంజనీర్‌గా నీతో కలిసి పనిచేశాను గుర్తుపట్టలేదా?" - ఉత్సాహంగా అతని చేతిని పట్టుకుని కుదిపేస్తూ, తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"సారీ ! మీరెవరో నాకు తెలీదు !"- కుడిచేతి బొటనవేలి గోరు కొరుక్కుంటూ చెప్పాడతను.

మహాదేవుడు షాకయ్యాడు.

"అయితే మీ పేరు వామనమూర్తి కాదా?" - అనుమానంగా చూస్తూనే అడిగాడు.

" కాదు ! తెనాలిరామకృష్ణ !"- సీరియస్‌గా చెప్పి ముందుకు సాగిపోయాడతను.

అలాగే కొయ్యబారిపోయి అతనివైపే చూస్తూ, నిలబడిపోయిన మహాదేవుడు భుజంమీద ఓ చేయి పడటంతో ఉలిక్కిపడి ప్రక్కకు తిరిగి చూశాడు.

" ఆయన మీకు తెలుసా?" భుజం మీద చేయివేసిన ఆ వ్యక్తి అడిగాడు...

"తెలుసా అంటే - మూడేళ్ళ క్రితం ఎస్సార్ కంపెనీలో పనిచేసిన మా ఫ్రెండు వామనమూర్తిలా వుంటేనూ - అతనే అనుకుని పలకరించాను... కానీ దెబ్బతిన్నాను... అతని పేరు తెనాలి రామకృష్ణట !" - చెప్పాడు మహాదేవుడు.

"ఒహో! అయితే నిన్నరాత్రి ఆ సినిమా కేసెట్ చూశాడన్నమాట...... అందుకే ఆ పేరు చెప్పాడు !"

షాక్ మీద షాక్ తిన్నాడు మహాదేవుడు.

" సినిమాపేరు చెప్పాడా? .... మరి అతని అసలు పేరేమిటి? ఇంతకీ మీరెవరు?" - అడిగాడు వెంటనే.

"మీరు అనుకుంటున్నట్టు అతను ఎస్సార్ కంపెనీలో పనిచేస్తున్న వామనరావే !...నేను అతని బ్రదరిన్లాని!"

ఇదేదో మిస్టరీలా అనిపించింది మహాదేవుడుకి.

"మరి తెనాలి రామకృష్ణ అన్నాడేమిటండీ?" -విస్తుపోతూనే అడిగాడు.

"అదో శాడ్‌స్టోరీ ! రండి చెప్తాను "- అంటూ పక్కనే వున్న ఇరానీ హోటల్లోకి లాక్కుపోయాడతను....

కూర్చున్న తర్వాత అతనే రెండు ' టీ ' లకు ఆర్డరిచ్చాడు.... ఆ తర్వాత మహాదేవుడి వివరాలడిగి తెలుసుకున్నాడు.

ఆ తర్వాత అసలు విషయం చెప్పాడు.

"మీకు తెలుసో, తెలీదో, మా బావగారికి తాగుడు బాగా అలవాటు !"

" అవును !.... గుర్తుంది... పగలుకూడా తాగి ఆఫీసుకొస్తుండేవాడు." - చెప్పాడు మహాదేవుడు.

" తర్వాత పగలు తాగటం మానేశాడు లెండి !... కానీ రాత్రిళ్ళు మాత్రం తాగందే వుండలేక పోయేవాడు - ఈ మధ్య ప్రొహిబిషన్ పెట్టారుకదా....... అందుకని తాగుడు మానేశాడు. అప్పట్నించీ ఇలా అయిపోయాడు... పొద్దు వాలిందంటే చాలు - మనల్నీ మన లోకాన్నీ మర్చిపోతాడు. ప్రొద్దున్నించీ సాయంత్రం అయిదుదాకా 'పెరఫెక్టు' గానే వుంటాడు... అందుకే ఏ సమస్యాలేకుండా ఆఫీసుకెడతాడు. అయిదయ్యాక అక్కడి స్నేహితులు కంపెనీ బస్సు ఎక్కించి ఇక్కడ దింపుతారు..... ఇక్కడ బస్‌స్టాప్‌లో నేను కాపలా కాసి - ఇంటికి తీసుకెళ్ళాలి. ఒకో రోజు బస్సు దిగిం తర్వాత ఏ ఇల్లు కనిపిస్తే ఆ ఇంటిలోకి వెళ్ళిపోతూంటాడు. అందుకే నేను జాగ్రత్తగా ఫాలో అవుతుంటాను...... రాత్రి ఇంక మందుండదు కనుక, కాలక్షేపానికి ఓ వీడియో కేసెట్ అద్దెకు తెప్పించి చూపిస్తూంటాం!. ఏ సినిమా చూస్తే - అందులో హీరో పేరే తన పేరుగా చెప్తుంటాడు, మరో సినిమా చూసేదాకా !" - వివరంగా చెప్పాడతను.

"ఇదేదో కొత్తరకం జబ్బులా వుంది - డాక్టర్‌కి చూపించవలసింది !"

"సైకియాట్రిష్టుకి చూపించాం !....... రోజా విపరీతంగా తాగుతూ, సడెన్‌గా

మానేస్తే ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయట. వీటిని విత్‌డ్రాయల్ సింప్టమ్స్ అంటారట ! కొన్నాళ్ళుపోతే అవే తగ్గిపోయి, మామూలు మనిషి కావచ్చునన్నారు....... ఎంత కాదన్నా నాకు బావగారు ! అందుకే నేను ఈ డ్యూటీ చేస్తున్నా ''- టీ తాగటం పూర్తిచేసి బయటకు నడుస్తూ చెప్పాడతను.

"త్వరలో మీ బావగారు మామూలు మనిషి కావాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.... రేపు ఎప్పుడైనా ఆయన మామూలుగా వున్నప్పుడు ఇలా నేను అమెరికా నించి వచ్చి వెళ్ళానని చెప్పండి " - అంటూ తన విజిటింగ్ కార్డు ఇచ్చి అతని దగ్గర శెలవు తీసుకున్నాడు మహాదేవుడు.

అక్కణ్ణించి ఆటోలో బయల్దేరి వనస్థలిపురం చేరుకున్నాడు.

అక్కడి పోస్టాఫీసు సందులో అతని మిత్రుడు విశ్వనాధం వుంటున్నాడు. అతను కూడా తనతో పాటే ఇంజనీరింగ్ డిగ్రీ పుచ్చుకున్నాడు. మంచి ఆస్తిపరుడు. అత్తవారివైపు నించి కూడా బాగా కలిసొచ్చింది. ఏభైలక్షల పెట్టుబడితో నాలుగేళ్ళక్రితం ఓ ఇండస్ట్రీని ప్రారంభించాడు. ప్రారంభించిన రెండేళ్ళకే కోటీశ్వరుడయ్యాడు. పొద్దువాలిందంటే చాలు కారేసుకుని క్లబ్బుకి వెళ్ళిపోతాడు.

ఆ సమయంలో అసలు 'విశ్వనాధం ఇంట్లో వుంటాడో - వుండడో' అనుకుంటూనే - ఆ వీధిలో పోస్టాఫీసు దగ్గర ఆటో దిగాడు మహాదేవుడు.

మూడేళ్ల క్రితంనాటికీ ఇప్పటికీ ఆ వీధి చాలా మారిపోయింది. చాలా ఇళ్ళు మేడలయ్యాయి. కొత్త కొత్త షాపులెన్నో వెలిశాయి. ఓ పెద్ద నర్సింగ్ హోం కూడా వచ్చింది. వాటన్నింటి మధ్యా విశ్వనాధం ఇల్లు ఎక్కడో కనుక్కోలేకపోయాడు మహాదేవుడు. అయితే అతని ఇంటి గేటుకి ఇరువైపులా అశోక వృక్షాలున్న సంగతి గుర్తుకొచ్చి - అలాంటి ఇంటికోసం వెతికాడు. అయినా ప్రయోజనం లేకపోయింది.

ఎవరో పెద్దమనిషి అటుగా వెడుతూంటే వాకబుచేశాడు... ఆయన, విశ్వనాధం ఇంటిని చూపించాడు.. కానీ ఆ ఇంటి ఆవరణలో అశోకవృక్షాలు కనిపించలేదు. సందేహిస్తూనే వెళ్లి తలుపు తట్టాడు.

లుంగీ, బనీనుతో వున్న విశ్వనాధం తలుపుతీశాడు. ఎదురుగా కనిపించిన చిరకాల మిత్రుణ్ణి చూసి ఆనందంగా ఆహ్వానించాడు.

"నువ్వు క్లబ్బు పక్షివికదా... ఈ సమయంలో ఇంట్లో వుంటావో వుండవో అనుకున్నా...

అయామ్ లక్కీ... దొరికావ్" హాల్లో వున్న సోఫాలో చతికిలబడుతూ అన్నాడు మహాదేవుడు.

"ఆ స్వర్ణయుగం దాటిపోయింది గురూ! క్లబ్బులో పేకాట్టం మానేసి ఇదిగో ఇలా నేనొక్కణ్ణే ఇంట్లో 'పేషెన్స్' ఆడుకుంటున్నా" అంటూ టీపాయ్ మీదున్న పేకముక్కల్ని చూపించాడు.

విశ్వనాధానికి 'ఏ హార్టెటాకో' వస్తే క్లబ్బుకెళ్ళొద్దని డాక్టరు సలహా ఇచ్చాడు కాబోలు' అనుకున్నాడు మహాదేవుడు. అయినా తన సందేహాన్ని నివృత్తి చేసుకోడానికి అడిగాడు-

"ఏం? ఎందుకు? క్లబ్బులో మెంబర్‌షిప్ విత్ డ్రా చేసుకున్నావా?"

" అదేంకాదు గురూ ! మన స్టేట్‌లో 'ప్రొహిబిషన్' పెట్టారుగా?"

"అవును ! తెలిసింది... అయినా, మందు కొట్టకూడదన్నారు తప్ప పేకాట ఆడుకోవద్దన్లేరుగా?" - అడిగాడు మహాదేవుడు.

"సర్లే! పేకాడుకోవటానికి క్లబ్బే కావాలా? పెళ్లాం చాలదూ... అసలు మందు లేనపుడు క్లబ్బులకు ఎవరెడతారోయ్?"- నిరుత్సాహం నిండిన స్వరంతో అన్నాడు.

"అయినా నీ బోటివాడు మందుకి మాత్రం మొహం వాచటం ఎందుకు? హాయిగా పర్మిట్ తీసుకోవచ్చుగా!"-

" కాదని ఎవరన్నారు?... కానీ పర్మిట్ మీద కక్కుర్తిగా నెలకో నాలుగు బాటిల్సు తెచ్చుకుని రోజుకో రెండు పెగ్గులు పుచ్చుకుని మూతి తుడుచుకోవటం కంటే - క్లబ్బులో నలుగురి మధ్యా కూర్చుని ఆరారగా మందు కొడుతూ, చికెన్ పకోడా 'మంచింగ్' గా తీసుకుంటూంటే - ఆ థ్రిల్లే వేరు!. అసలు రేపెపుడో ఈ పర్మిట్లుకూడా రద్దు చేయరని గ్యారంటీ ఏమిటి?.. అయితే ఓట్లు వేసేది పేదవాళ్ళే కనుక - వాళ్ళు తాగే కల్లుని మాత్రం నిషేధించరని అనుకుంటున్నాను. అందుకే నేను కూడా 'కల్లు' కి ' కన్వర్ట్' అయిపోయాను. మా పెరట్లో అశోకవృక్షాల్ని కొట్టించేసి ఆ 'జాగా' లో నాలుగు తాటి చెట్లు నాటించాను!" చెప్పాడు విశ్వనాధం.

వాళ్లింటి ముంగిట అశోకవృక్షాలు కనిపించకపోవడానికి గల కారణం మహాదేవుడికి అప్పుడర్థమైంది

అయినా అమాయకంగా అడిగాడు. "తాటి చెట్లు ఎందుకూ పెంచడం?"

"ఎందుకేమిటి నీ మొహం? అవి పెరిగి పెద్దవైతే బోలెడంత కల్లు"

"ఇపుడు మాత్రం దొరకదా?"

"దొరుకుతుందనుకో . కానీ షాపుల్లో అమ్మరు కదా? మనబోటివాళ్లం చూస్తూ చూస్తూ  కల్లు దుకాణానికి వెళ్లలేం! పైగా తాటిచెట్టు కిందే కూర్చుని తాగాలంటూ రేపెప్పుడైనా  చట్టం వచ్చినా రావచ్చు! మనం ఎక్కడికో వెళ్ళి అలా చెట్టుకింద కూర్చుని తాగలేం" చెప్పాడు విశ్వనాథం.

"ఆ పాయింటు కరక్టే! చాలా చీప్‌గా వుంటుంది. ఇంత బతుకూ బతికి ఇంటి వెనకాల బాల్చీ తన్నేసినట్టు-ఫైవ్‌స్టార్ హోటల్లో కూర్చుని ఫారెన్ విస్కీ తాగిన నీ బోటివాడు పల్లెటూరెళ్లి తాటిచెట్టు కింద 'బాసింపట్టు' వేసుక్కూర్చుని కల్లుముంత ఎల్లా పట్టుకోగలడు?" అన్నాడు మహాదేవుడు.

"అదీ! అందుకే మన కాంపౌండులో మన కుర్చీవేసు క్కూర్చుని మన తాటిచెట్టు నించి వచ్చిన మన  కల్లుని  మనం  తాగితే - మన  మర్యాద  మనింట్లోనే  వుంటుంది." విశ్వనాథం  ఫిలాసఫీ విన్న మహాదేవుడు ఆశ్చర్యపడకుండా వుండలేకపోయాడు.

ఆ తర్వాత అతని 'ఇండస్ట్రీ' ఎలా నడుస్తోందో తెలుసుకుని-తన  అమెరికా జీవితాన్ని గురించిన విశేషాలన్నీ అతనికి వివరించి-అప్పటికి బాగా పొద్దుపోవడంతో-తిరిగి తన హోటల్‌రూమ్‌కి చేరుకున్నాడు.

రెండోరోజు సెమినార్ పూర్తయిన తర్వాత  సనత్‌నగర్‌లో వుంటున్న మరో మిత్రుడు ఆంజనేయుల్ని కలుసుకోవడానికి బయల్దేరివెళ్లాడు మహాదేవుడు. అయితే అతని ఇంటికి వేసివున్న తాళంకప్ప వెక్కిరిస్తూ కనిపించింది. పక్కింటికి వెళ్లి వాకబుచేశాడు.

"ఆయన, బొంబాయి ట్రాన్స్‌ఫర్ అయ్యారండీ! అప్పుడే నాలుగు నెలలైంది" చెప్పాడు పక్కింటాయన.

"సాధారణంగా మా ఆంజనేయుల్ది ట్రాన్స్‌ఫరయ్యే ఉద్యోగం కాదే" ?

"నిజమేననుకోండి..కానీ కావాలని, లంచం ఇచ్చి మరీ చేయించుకున్నారు" అని చెప్పాడు అతను.

"కావాలనా? ఎందుకూ? ఏమైంది?"

"ఎందుకేమిటండీ? ఈ స్టేట్‌లో ప్రొహిబిషన్ వచ్చిందిగా! అక్కడైతే అది లేదు కనక స్వేచ్ఛగా తాగచ్చని" - అంటూ ఇంకా ఏదో చెప్పబోతూంటే విషయమంతా అర్థమైన వాడిలా, తల పంకించి వెనుదిరిగాడు మహాదేవుడు.

మూడోరోజు పొద్దున్నే యధాప్రకారం సెమినార్‌కి వెడదామని హోటల్లోంచి

బయటకు వచ్చాడు.

రోడ్డుమీద ఒక్క ఆటో కూడా కనిపించలేదు. అంతలో అటుగా పోతున్న ఖాళీ టాక్సీని పిలచి ఎక్కాడు.

"ఇవాళ ఆటోలు కనిపించడం లేదేమిటి?" కొంత దూరం వెళ్లాక, యదాలాపంగా అడిగాడు టాక్సీడ్రైవర్ని.

"మీకు తెలీదా సార్. ఇవాల్టినించీ ఆటో డ్రైవర్లు నిరవధిక సమ్మె చేస్తున్నారు."

"ఎందుకట?"

"వాళ్లకి రాత్రి ఎనిమిది గంటలనించే 'హాఫ్ రిటర్న్' కావాలట సార్"

"రాత్రి పదినించీ ఉదయం అయిదుదాకా హాఫ్ రిటర్నేగా?"

"ఉందనుకోండి! కానీ ప్రొహిబిషన్ వచ్చిందిగా?"

"వస్తే?"

"ఇదివరకైతే నూటికి అరవైమంది బయట 'బారు'ల్లోనూ, క్లబ్బుల్లోనూ, సారా దుకాణాల్లోనూ చిత్తుగా తాగి పదిగంటల తర్వాత ఇంటికెళ్ళేవారు. కానీ ఇప్పుడు బుద్ధిగా అయిదయ్యేసరికే ఇళ్ళకు చేరిపోయి-పెళ్లాల్తో మొదటాట సినీమాలకి చెక్కేస్తున్నారు. ఫస్ట్ షో వదిలింతర్వాత ఇళ్లకు వెళ్లే జనాలే, జనాలు! ఆ తర్వాత రోడ్లన్నీ ఖాళీ... ఇక ఆటోలకు బేరాలేం వుంటాయ్ సార్?" చెప్పాడు టాక్సీ డ్రైవరు.

ఆ మాత్రం విషయాన్ని కూడా అవగాహన చేసుకోలేక అతన్ని అడిగినందుకు తనను తానే మనసులో నిందించుకున్నాడు మహాదేవుడు.

అంతలోనే డ్రైవరు మళ్లీ అన్నాడు-

"సార్! నాదో అనుమానం సార్"

"ఏమిటో?"

"మన సొసైటీలో రహస్యంగానైతేనేం, పబ్లిగ్గానైతేనేం- సగానికి సగంమంది మందుభాయీలున్నారు కదా. ఆళ్ళంతా ఏదో ఒక సరుకు-ఏదో ఒక వంకన ఎక్కడో ఒకచోట చిత్తుగా తాగి- ఏ అర్ధరాత్రికో కొంపకిచేరి-మత్తుగా పడుకొని నిద్దరోయేవారు.... మరిప్పుడు ఆళ్ళంతా పొద్దాకే సరికే ఇల్లు సేరిపోతే-కాలచ్చేపంలేక-కట్టుకున్న ఆడోళ్ళను కాల్చుకు తినరా అంట?"

అతని అనుమానాన్ని ఎలా నివృత్తి చేయాలా అని మహదేవుడు ఆలోచిస్తూండగానే

మళ్లీ అందుకున్నాడు టాక్సీడ్రైవరు -

"నాకైతే డవుటే సార్! ఈదిలోకంటే ఇంటోనే ఎక్కువసేపుండిపోయే మొగుళ్ళతో ఏగలేక- మద్యపాననిసేదం కావాలంటూ ఇష్లవం లేవదీసిన ఆడంగులే మళ్ళీ 'మద్దెపానం అమల్లోకి తెండి బాబూ' అని ఉద్దెమం తెస్తారేమో"-అతని ఊహాతీతమైన ఆలోచన విని మహాదేవుడు నవ్వుకున్నాడు.

అంతలో టాక్సీ జూబ్లీహాలు చేరుకుంది.

ఆరోజు కూడా సెమినార్‌లో పాల్గొని - నాలుగో నాడు అమెరికాకు తిరిగి ప్రయాణ మయ్యాడతను.

★ ★ ★

ఆ రోజు పొద్దున్నే నిద్రలేచిన మహాదేవుడు బెడ్‌కాఫీ తాగుతూ పేపరు చేతిలోకి తీసుకున్నాడు. ఆ పేపర్లో అడుగున వున్న 'బాక్స్ ఐటమ్' గా వచ్చిన వార్త అతన్ని ఆకర్షించింది -

'ఆంధ్రప్రదేశ్‌లోని ఓ చిన్న కుగ్రామంలో మద్యనిషేదానికి వ్యతిరేకంగా 'మల్లమ్మ' అనే చదువుకున్న మహిళ ఓ ఉద్యమాన్ని ప్రారంభించిందట! ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యనిషేదం వల్ల తమ మహిళాలోకమే ఎక్కువ నష్టపోతోందనీ -అందుకనే ఆ ఉద్యమాన్ని చేపట్టవలసి వచ్చిందనీ ఆమె చెప్తోందట!!'

మహిళాజగత్తు ఏ విధంగా నష్టపోతున్నదీ, ఎలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నదీ కూడా ఆమె వివరించింది-

'ఇది వరకు ఈ చట్టం అమల్లో లేనపుడు మగవాళ్లు (భర్తలు) తాగొచ్చి అన్నీ నిజాలే చెప్పేవారు. భార్యలపై అతిగా ప్రేమ కురిపించి తాగిన మైకంలో ఎన్నెన్నో వరాలిచ్చేవారు. అన్నం కూడా తినకుండా ఆ మత్తులో మన్ను తిన్న పాముల్లా పడుకుని నిద్రపోయేవారు. దానివల్ల ఎన్నో కొన్ని బియ్యం కలిసొచ్చేవి. కానీ ఇపుడు ఈ చట్టం అమల్లోకి రావడం వల్ల పొద్దువాలగానే 'మొగుళ్లు' ఇంటి కొచ్చేసి- భార్యల్ని 'అది చెయ్యి-ఇది చెయ్యి' అని వేధిస్తున్నారు......

.....పక్కింటి పిన్నిగార్ల ఇళ్ళకు వెళ్లనివ్వకుండా 'సుత్తేసి' విసిగిస్తున్నారు. ముఖ్యంగా భర్తలు ఎక్కువసేపు ఇళ్ళల్లో భార్యల ఎదురుగా వుంటారు కనుక వాళ్ళలో 'కామం'

ప్రకోపించి-మున్ముందు జనాభా పెరుగుదలకు దారి తీసే అవకాశం వుంటుంది. అలా పెరిగిపోయే జనాభా కారణంగా ధరలు మరింత పెరిగిపోయే ప్రమాదం వుంటుంది'.........

"ఏవండీ...! మిమ్మల్నే...! ఇండియానించి తిరిగి వచ్చింతర్వాత ఒకటే నిద్ర. లేవండి... మనకి తెల్లారింది" అంటూ తట్టి అరుంధతి నిద్ర లేపుతూంటే... ఉలిక్కిపడి లేచి కళ్లు నలుపుకుని చూశాడు మహాదేవుడు.

"కాఫీ తీసుకోండి " అంటూ కప్పు అందించింది.

"ఇప్పుడే తాగానుగా" అయోమయంగా భార్యవైపు చూస్తూ చెప్పాడు.

"ఇప్పుడే తాగడం ఏమిటి? కలగాని కన్నారా?"

"అంటే...నువ్ బెడ్‌కాఫీ ఇవ్వడం- అది తాగుతూ నేను పేపరు చదవడం....."

"ఏమిటీ? పేపరు చదివారా? ఇంకా పేపరు తీసుకురాలేదు" చెప్పింది అరుంధతి.

అప్పటికి అసలు సంగతి బోధపడింది. " ఓ! అయితే మన 'ఏ పీ' లో మద్యపాన నిషేధ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం రావడం..." అంటూ మహాదేవుడు ఏదో చెప్పబోయే టంతలో అరుంధతి అందుకుంది-

"చాల్లెండి! అక్కడ ఎంచక్కా ఆ చట్టం చేశారూ, ఆడవాళ్ళు సుఖపడుతున్నారని నేననుకుంటుంటే వ్యతిరేకంగా ఉద్యమం అంటారేమిటి? మీరు హైదరాబాద్‌నించి తిరిగొచ్చి అక్కడి మీ అనుభవాలు చెప్పారుగా.... బహుశా అదే ఆలోచిస్తూ పడుకున్నారేమో ఆ పాడు కలొచ్చింది"

"అమ్మయ్య! కలేకదా" అనుకుని తేలిగ్గా నిట్టూర్చి కాఫీ కప్పు అందుకున్నాడు మహాదేవుడు. ★

(ఆంధ్ర ప్రదేశ్ లో "ప్రొహిబిషన్" అమల్లోకి వచ్చిన నేపధ్యంలో రాసిన కధ)
(స్వాతి -వీక్లీ 3-11-95)